("జ్యోతి" మాసపత్రిక; మార్చి 1970)

# గమనశ్రమ

"బోరు కొట్టేస్తోంది మేష్టారూ" అన్నాడు భాస్కరం.

"ఎవరు, రంగమ్మగారేనా?" అన్నాను పరధ్యానం నటించి. రంగమ్మ గారంటే, నిర్మలను పెంచుకుంటున్న రిటైర్డు లేడీ డియ్యీవో.

"సరేలెండి. ఎవరో వుంటే బోర్రు మనమే కొడ్తాంగా! ఎవరూ లేక పోవడాన్నే లైఫ్ సింగ్యులర్‌గా మొనాటనస్‌గా తయారయిపోయి బోర్ కొట్టే స్తోంది సార్"

"అలాగా"

భాస్కరం వాల్తేర్లో ఏధో పెద్ద క్లాసే చదువుతున్నాడు. చాలా తెలివి గలవాడే గాని చటుక్కుని పరీక్ష పాసైపోతే లటుక్కుని ఏదేనా బాధ్యత ఉద్యోగం వేషంలోనో పెళ్ళివేషంలోనో తగులుకుంటుందని- ఆ పైనలియర్నే ఐదేళ్ళ బట్టీ అలా దీక్షగా చదువుకొస్తున్నాడు.

"మంచివాడు" "ఇంటరెస్టింగ్ చాప్" "టెరిబుల్ ఫెలో" అంటారు. అతన్ని గురించి డాక్టరు వసుంధరా దేవి; ఫిలాసఫీ ప్రొఫెసర్ సుబ్రమణియన్; ఎడ్వకేట్ కామేశ్వర్రావుగార్లు; మొదలగువారు.

అతను పాటలు పాడుతాడు. నాటకాల్లో వేషాలు వేస్తాడు. (నాటకాలు రాస్తాడేమో అని కూడా నా కనుమానం.) బాగా ఇమిటేట్ చేస్తాడు. ఈ మధ్య అన్ని కాలేజీల్లోనూ మిమిక్రీ చేసేవాళ్ళు ప్రెయినవుతున్నారు కదా. యూని వర్సిటీకి ఇతను—

భానుమతి పాటలు భానుమతి లాగ పాడుతాడు—రఫీ పాటలు రఫీలాగ పాడుతాడు. నాగయ్య డైలాగులు, రాజబాబు కంగారు అరుపులు అన్నీ బాగా వస్తాయి. నూర్జహాన్‌వీ, జోరా ఆఫ్ అంబాలావీ పాత పాటలు అతన్చేత పాడించుకోవాలని నా కెన్నాళ్ళనించో కోరిక. కలకటా రాసి ఆ ఎల్. పి. రికార్డులు తెప్పించాలి.

"ఇప్పట్నించీ వొద్దు గురువుగారోయ్- నేను టేపు రికార్డర్ కొనుక్కొనే

దాకా ఆగండి. ఆ గొంతుకలు మళ్ళీ మళ్ళీ అనలేను—" అన్నాడు భాస్కరం నేనోమాటు ఆ మాట అంటేను.

అలాంటి కుర్రాడికి లైఫ్ బోరు కొడ్డానికి వీల్లేదు.

"లైఫ్ అంటూ ఒకటి మన జీవితాల్లో యెక్కడో దాక్కొని ఉందనుకో. కాని ఆవిడగారు ముస్తాబైవొచ్చి నిన్ను బోరు కొట్టేదాకా నువ్వు అందులోంచి పారిపోలేక పోతున్నావంటే- నాకేమిటో నమ్మకంగాలేదు భాయ్" అన్నాను.

"అంతా ఈ మధ్యనే సార్"

"ఏం, మీ నిర్మలేమయింది? నిర్మలంగా వుండిపోతానందా?"

"ఛా ఛా, యిన్సల్ట్! నిర్మల కంటుకున్న మలినం పోలికలన్నీ నావేనని యూనివర్శిటీలో ఏ గోడా మీ కింకా చెప్పలేదా?.... పోన్లెండి వెళ్ళిపోయింది దాంతో మీకేమిటి?.... విశాఖ వదిలెళ్ళిపోయింది సార్. నిర్మలే కాదు; సుజాతా, కమలా, నారాయణమ్మా, జానీ అందరూ వరసగా తప్పుకున్నారు. ఇప్పుడు మినిమమ్ ఒకరైనా గర్ల్‌ఫ్రెండు మనకి ఇమ్మీడియెట్ నెస్సిటీ, రేషను కార్డుకంటే కూడా ముఖ్యమైన అవసరం అయిపోయింది సార్........ రండి అలా వెళ్ళి సిగరెట్స్ తెచ్చుకుందాం"

వాళ్ళ పెద్దన్నయ్య నా ఫ్రెండు రాజమండ్రిలో ఎడ్వకేట్. "మా వాడు చెడిపోతున్నాడంటూ ఉత్తరాలొస్తున్నాయి. నువ్వు చూస్తే అనకాపిల్లి తాలూకాఫీసులోనే కుళ్ళుతానంటావు కాని వైజాగు ట్రాన్స్‌ఫరేనా చేయించుకోవు. వాడికి నువ్వు గార్డియన్‌గా వుంటానని ఎంతో ఆశపడ్డాను" అని అలా ఏదో రాస్తూంటాడు; నాకెప్పుడేనా ఉత్తరం రాస్తే—

కాని— వాడికి తెలీదు. వైజాగు అప్పుడప్పుడొచ్చి చూడ్డానికి బావున్నంతగా కాపురం వుండడానికి బావుండదు— ఎవరికో తప్ప.

రెండు; భాస్కరంలాంటి హుషారైన కుర్రవాడికి; పాదరసంలాంటి అతని చురుకుతనానికి గార్డియన్‌గా వుండటం తాలూకాఫీసులో ఉద్యోగం చెయ్యడం కన్నా కష్టం. అప్పుడు భాస్కరం నా దగ్గిర మహేంద్రకపూరు పాటలు పాడ్డు. శివాజీగణేశన్‌కి జగ్గయ్య చెప్పిన డైలాగులు అనడు. ట్విస్టు లేదు. రాకెన్రోల్ లేదు. అంతా చప్పగా స్ట్రెయిట్‌గా అయిపోయింది.

అయినా సరే— "మీ అన్నయ్య లెటర్రాసేడు" అన్నాను.

"ఏమిట్రాసేడు?— మా భాస్కరం గాడి కోసం రోజూ కోర్టులో అబి

ద్దాలు ఆడలేక, ఆడించలేక చచ్చిపోతున్నాను. వాడు ఈ ఏడాదేనా ఒడ్డెక్కేటట్టు చూడు. అని రాసేడు కదూ! అక్కడికీ నేనీ మధ్య మా ప్రొఫెసరు బ్రహ్మయ్యగారి దగ్గిర——

"అయ్యయ్యో ఓఓఓ బ్రహ్మయ్యా
అన్యాయం చేసేవేమయ్యా?
ఈ ఏప్రెల్లో ఒడ్డు చేరితే ఎంత గుమ్మంగా ఉండేదయ్యా
య్యా, య్యా. య్యా,

అని మిమిక్రీ ద్వారా సజెష్టు చేసేను. ఆయనకి వినిపించలేదో యేమో ఖర్మ. మీరు ఈ మాటు నా ప్రయత్న లోపం యేమీలేదని మా అన్నయ్యకి రాసెయ్యండి. మీ మాటంటే వాడిగ్గురి. మీ రాతంటే అంతకన్నానూ."

నవ్వుకున్నాను. ఇలాంటివాడు పరీక్ష పాసైపోతే యెలాగా అని వో నిమిషం బెంగెట్టుకున్నాను కూడాను.

"దానికేం గాని లైఫ్ బోరు కొట్టకుండా చూసుకోవడం యెలా మేషారూ?"

నేను చెప్పకముందే అతనికి ఆ పాయింటు మీద వొక ఐడియా వున్నాది. "తుమ్మెద కొత్తపువ్వుల్ని చూసుకోవాలి" అని కాని——అదికాదయ్యా అది నీకు తప్పు. బుద్ధిగా చదువుకొని చక్కగా పరీక్షలు రాసి పాసవ్వాలి. భావి భారత పౌరులు మీరు. మీకు అనేక బాధ్యతలున్నాయి. అని లెక్చరు కొట్టనా? పారిపోతాడు!

*　　　*　　　*

"మరి నువ్వు నాకో మాట ఇవ్వాలి" అన్నాను.

"మాటివ్వడమేమిటి? చేతులో చెయ్యివేసి గిల్లమంటే కూడా గిల్లుతాను చెప్పండి"

"ఒకమ్మాయుంది. ఆ అమ్మాయిని నీకు పరిచయం చేస్తాను. అయితే ఆ అమ్మాయిని నువ్వు అందర్లాగా——"

"థేంక్స్ థేంక్స్ థేంక్స్ మాష్టారు! ఎవరా అమ్మాయి; ఏమా అడ్రసు? ఆం.... ఆం.... నే ననుకుంటూనే వున్నాను——" అని రావి కొండలరావు మొహం గొంతుకా పెట్టి; "మీరు.... ఈ వయస్సులో ఈ కాస్టాప్ లివింగు ఇలావున్న రోజుల్లో.... ఈ వయి జాగు.... ఇన్నిమాట్లు వొస్తున్నారంటే——

ఎవరో అమ్మాయి వుండే ఉంటుందని అనుకుంటూనే ఉన్నాను....చెప్పండి.... ఎవరు మీకు తెలుగు చెప్పిన మేష్టరు? తదరినన్నాం.... ఆతాణా"

"సరేలే. నీకు ఏ విషయమూ సీరియస్‌గా ఆలోచించే యోగ్యత లేదని తేలిపోయిందిగా. నిష్కారణం ఒక మెడికో అమ్మాయిని పరిచయం చేసి ఆ పాపం నేను కట్టుకోలేను" అన్నాను.

"ఛ ఛ బొద్దుంబాల్ మేష్టారు. మీకు తెలీదుగాని; మనం మర్యాదస్తుల దగ్గిర మర్యాదస్తుల్నరగా వుంటాం. కావ(ల)స్తే—"

"ఓ! అడగక్కర్లేదు నీ గురించి—" అని విసుక్కున్నాను.

"అందుకేగా, మీరు మాట యిమ్మన్నారు; ఇమ్మీడియట్‌గా ఇచ్చేశాను. ఒట్టు వెయ్యమంటే వేస్తాను."

"నాకు ఒట్లూ ప్రమాణాలూ అంటే నమ్మకం లేదు."

"అది— అంచేత మనుషుల్నికూడా నమ్మరు."

"మనుషులందర్నీ యెందుకు నమ్మను—?"

"పోనీ నన్ను— అయితే గురువుగారూ; మీకు నే నెప్పుడు నమ్మక ద్రోహం చేసేనో చెప్తారా?"

"సరే—అదంతా యిప్పుడెందుగ్గాని"

"అలా దారికి రండి— యిప్పుడు చెప్పండి. ఒకటి-ఎవరా అమ్మాయి?"

"రిటైర్డు ట్రెజరీ ఆఫీసరు దశరథరామయ్యగారి కూతురు."

"ధన్యుడను. అసలేవూరుట?"

"వాళ్ళదా?— తణుకు అనీ;—"

"తెలుసులెండీ— సరే. అమ్మాయి పేరు?"

"పూర్వీ కళ్యాణి"

"అబ్బా! ఏదో రాగంలా ఉందే! వినిపించని రాగాలే; అనిపించని అందాలే; కలలో ఎవరో పిలిచే!"— ఓహో!"

"అవును! రాగమే, వాళ్ళ నాన్నగారికి సంగీతం యిష్టం. పూర్వీ కళ్యాణి రాగం బాగా ఆలాపన చేసిన నాడు ఈమె పుట్టిందిట— ఆ పేరెట్టారు"

"ఆహా!....పూర్వీ....కల్యాణి— పూర్తి పేరు పిలవాలంటే పూరీ కల్యాణి అని వచ్చేస్తుంది— కల్యాణి అని పిల్చుకోవచ్చు.... నా కిది సరి పోర్తు పేరు మేష్టారూ. ఈ పేరు గల అమ్మాయి మనకెక్కడా తగల్లేదు....

పరీక్ నో సబ్‌స్టిట్యూట్ ఫర్ వాటర్ అన్నట్టుగా; కల్యాణికి కల్యాణే సాటి బొంబాయిలో అయినాసరే; మరెక్కడేనా సరే !.... సరె- ఫర్దర్ ?"

"అంటె ?"

"ఏ ఇయరు? ఎక్కడుంటుంది అవన్నీ చెప్పండి మరీ."

"ఇంకా ఇక్కడ జాయిన్ కాలేదు"

"హరి హరీ! మా వూరి సినిమా హాల్సులో మంచి సినిమాల్లాగ త్వరలొ వస్తున్నది- అని రాసుకోమంటారా?"

"ఎన్నాళ్ళో అవదు. గుంటూర్లో రెండేళ్ళు చదివింది. ఇక్కడికి ట్రాన్స్ ఫర్ చేయించడానికి ఏర్పాట్లయ్యేయి. గవర్నమెంటు ఆర్డరు వచ్చేసింది. ఇంక జాయిన్ అవడమే తరవాయి."

"మరీ మంచిది- స్టేషన్లో దిగగానే మనమే వెళ్ళి స్వాగతం- సుస్వాగతం జయహో- అని చెప్పొచ్చు."

"ఈ వూళ్ళో దొండపర్తిలో వాళ్ళ చిన్నాన్నగారు డాక్టరు. అక్కడ పుటప్ చేస్తుంది."

"కనీసం వారితో పరిచయం చేయండి ప్రస్తుతం. ఆ తరవాతైతే మనం ఏదో అ అమ్మాయికోసం పరిచయం చేసుకున్నాం అనుకొంటాడు"

"ఆయనలా అనుకోడు"

"అనుకోడు కాబట్టే పూర్వి కల్యాణి ఈ ఊరొస్తోంది. నాకు చెప్పకండి."

"ఇలా వెకిలిగా మాట్లాడితే రెండురోజుల్లో చాలించుకుంటుంది."

"అదంతా నే చూసుకుంటానుగా....మన్ని వెకిలి అనడానికి చాలాసేపు మూతులు బిగించుక్కూచోవాలి మేష్టారూ."

o o o

"మోసం మేష్టారూ, మోసం!"

"అదేం?"

"కల్యాణీ లేదు ఖమాసూ లేదు ఫర్దియర్‌లో ఎవరూ కొత్తమ్మాయి జాయిన్ కాలేదుట. రోజూ మెడికల్ కాలేజీకి వెళ్ళిరావడం అవుతోంది."

"అప్పుడే యన్‌క్వైరీ ప్రారంభించేవా ?.... అయితే నా ఉత్తరం అందలేదన్నమాట ?"

"ఉత్తరమా ? అదేమని ?"

"కల్యాణికి టైఫాయిడ్, - నెలరోజుల్దాకా రాదు."

"అరె! వాటే బాడ్ న్యూస్!"

"లెటర్ నీకు పోస్టుచేసి మూడురోజులు దాటిందే !.... ఎప్పుడూ రాయనివాణ్ని నీకు కదా అని ఉత్తరం రాస్తే అది కాస్తా మిస్ అయిపోయిందా ?"

"అదేలెండి. ఎప్పుడూ రాయడం అలవాట్లేదు కదూ. ఎడ్రస్ రాయడం మరచిపోయుంటారు."

"అది కాదయ్యా, రీసెంట్‌గా- అదే మొన్న నీతో మాటాడి వెళ్ళేక ఆయన ఉత్తరం రాసేరు."

"ఎవరు?"

"అదే- దశరథరామయ్యగారు"

"ఆయనెవరు బాబూ, నా పీకలమీదికీ? ఏదేనా కోర్టుపని మీద గట్రా విశాఖపట్నానికి తగులడుతున్నాడా యేం?"

"అంతా తొందరే! మనిషి ఎవరో ఊహించకండా కామెంట్లు-"

"ఆగండాగండి....దశరథరామయ్య కొంపదీసి పూర్వీ కల్యాణి ఆలపనా మురుదు కాడుగదా-"

"ఎగ్జాక్లీ- ఈ మాత్రం జ్ఞాపకశక్తి నీ కింకా మిగిలి వున్నందుకు నీ పరీక్ష ఫెయిలవ్వకుండా వొడ్డెక్క వచ్చునే!"

"ఇది స్పెషల్ కేసు- అందుకనిలెండి; జ్ఞాపకం........ఇంతకీ ఏమని రాసేరు?"

"ఆఁ మా అమ్మాయి వైజాగులో చదవడానికొస్తోంది; కాస్త యెర్రగా బుర్రగా వున్నవాణ్నెవర్నైనా చూసి పెట్టమని రాసేడు"

"పెళ్ళికే ?"

"కాకపోతే లవర్‌గా వుండటానికనుకున్నావా"

"ప్చ్! ఈ రిటైర్డు ఆఫీసర్లున్నారే- ప్రపంచం అందర్నీ రిటైర్ చేసి ఎలాగో సెటిల్ చేసేద్దాం అనుకుంటూ వుంటారు గాబోలు."

"ఇందులో తప్పేమిటన్నాడోయ్"

"తప్పా తప్పున్నరా ? థర్డియర్ మెడిసన్ చదివే అమ్మాయికి పెళ్ళేమిటండీ- కనీసం హౌస్సర్జన్సీ అయినా పూర్తికాందే ఈ అర్జన్సీ ఎందుకండి?"

"సరే ఆయన ఉత్తరంలో రాసేడు- పూర్వీకల్యాణికి జరం; టైఫాయి డంటున్నారు, అంచేత ఇలా నెల్లాళ్ళు పోయేదాకా పై జాగు రాలేదు" అంటూను, చివర్ని "ఎవరేనా కుర్రాడుంటే ఊరికే పోనివ్వకు-"

"వెంటనే రాసెయ్యలేకపోయారా; ఇక్కడ మనవాడొకడున్నాడు; పరిచయం అయినవాళ్ళనెవ్వర్నీ ఊరికే పోనివ్వడు అలా అని-?"

"ఆ మాటే రాసేద్దాం అనుకున్నా, కాని అతికేచోట తెంపడం దేనికని ఊరుకున్నాను."

"అదేమిటండోయి అతుకు అంటున్నారు. అతుకంటే నాకు బితుకు- కనక మీరు మరో కుర్రాణ్ణి వెతుకుతే నా బతుకేదో నేను బ్రతుకుతాను"

"మరి మొన్న, అమ్మాయిని జాగ్రత్తగా చూసుకుంటానని చేతుల్లో చెయ్యి వేసేవు కదోయ్"

"అంటే సోదరీ ప్రేమతో చూడమనికదా మీ ఉద్దేశం?"

"సర్లే- బండి మళ్ళా మొదటికొచ్చింది........"

o o o

"ఈ అమ్మాయి కాక ఒక అబ్బాయి అతను మిలిట్రీ ఆఫీసర్."

"వేరీ గుడ్."

"పదివేలు కట్నం యిస్తారు"

"లాభంలేదు మేషారూ, కట్నం ఔట్ డేటయిపోయింది. అది మీ తరవ ఫేషను."

"ఎవరి కర్మకెవరు కర్తలు?"

"అసలు కట్నాలు ఆఫర్ చెయ్యకుండా- ఏదేనా జాబ్ యిప్పిస్తామనో, మరెలాగో ప్రారంభించాలి, ఈ వరుడు కోసం వేట-"

"ఆ! జాబ్ యిప్పించవలసిందే! పరీక్షలు ఫెయిలవుతున్నావు గనక ట్రెజరీలో యల్. డి. సీగా వేయించగలడు."

"అది కాదు మేష్టారూ, మరీ మా అన్నయ్యలా మాట్లాడతారేం? పరీక్ష పాసవగానే జాబ్ వస్తుందన్న షూర్టీ వుంటే తలుచుకున్న వెంటనే పాసం లేనూ ?"

"అవుతావు అవుతావు! కాని నీకు పరీక్షల్ని తల్చుకోడానికి తీరుబాటేదీ? ఎంతసేపూ-"

ఘాస్కారం ప్రొటెస్టు చేస్తాడని ఆగాను. అతను ప్రొటెస్టు చెయ్యలేదు సిగరెట్టు ఘాటుగా రెండు దమ్ములు లాగి "....సరేలెండి.... నే నిందాకే చెప్పేను: మీ రివాళ మా అన్నయ్య వాసన వేస్తున్నారని." అన్నాడు.

ఆ మాట నాకు గట్టిగా తగిలింది— ఊరుకున్నాను.

"ఎడుకేషన్లో, సివిలిజేషన్లో; పోనీ ఎజుకేషనల్ సివిలిజేషన్లో మీ తరానికి ఎంతో తేడా యేర్పడింది మేష్టారూ— మీ టైమ్‌లో అదే బ్రిటిష్‌వాడు దేశం నుంచి వెళ్ళిపోయిన తొలి పదేళ్ళలో అనుకోండి. జాబ్స్‌కి ఇంటలిజెన్స్, ఇండస్ట్రీ వున్న మెంగ్మెన్ యెంత మంది వున్నా చాలేవారు కాదు. ఇంకా కావలసి వచ్చేరు. అంచేత చదువైపోతే యేం చేద్దాం అన్న ప్రాబ్లెం లేదు మీకు. మాకు అలాక్కాదు. క్రమంగా పాపులేషన్ పెరిగింది. ఎజికేషన్ అందరికీ అందుబాట్లోకొచ్చి ప్రతివాడూ ప్రతి జాబ్‌కి క్వాలిఫై అయ్యాడు. చిన్న చిన్న వుద్యోగాలు రెడీస్ చెయ్యగల్గుతున్నారు. దాంతో చిన్న ఉద్యోగానిక్కూడా ఎక్కువ క్వాలిఫికేషన్సున్న జీనియస్‌లు సిద్ధపడవలసి వస్తున్నాది. అందుకని బాగా చదువుకుందాం; ప్రాస్పర్ అవుదాం అన్న తపన ఒక స్టేజిలో అనవసరపు వేదన అయిపోతోంది. చదువుమీద పెట్టుబడిగా ఉపయోగించిన తెలివికీ పరిశ్రమకీ తగిన ప్రతిఫలం జీవితంలో లభ్యంకావడంలేదు. అందుచేత ఏవరేజి స్టూడెంటు ఏదో 4 మార్కులు ఎక్కువ వస్తే మంచిదికదా అని ప్రూడెంట్‌గా చదువుతున్నాడే తప్ప, నిజమైన ఇంటలిజెంట్ స్టూడెంట్‌కి స్ట్రగుల్ కావలసినంత అవసరమూలేదు; దానికి తగిన ఆకర్షణలూ లేవు."

"ఆ పరిస్థితుల్లో మీ తరంవారు మరింత బాగా చదువుకుని, మరింత శ్రమపడి కాంపిటిటివ్ స్పిరిట్‌లో పని చేయాలి కదా. నువ్వు చెప్పిందాని ప్రకారం మా కాలంలో "డూయింగ్ వెల్" సరిపోయేది. మీకు అది వర్తించక "డూయింగ్ బెటర్ దాన్ అదర్స్" అవసరం వస్తోంది కదా!"

"సరే— అలా వుంచండి. మీ టైమ్‌లో హిస్టరీ, జాగర్ఫీ, తగుమాత్రం పొలిటికల్ కాన్షస్‌నెస్సు ఉంటే చాలు; స్మార్ట్‌గా వుండడం సాధ్యపడిపోయేది. మాకు అలా లేదు— కామన్ సెన్సే కాకుండా కామన్ నాన్సెన్స్‌లో కూడా ప్రవేశం ఉండాలి. పబ్బాస్‌లోనే కాక పై పెస్‌లో కూడా చెయ్యి ముంచి తియ్యవలసి వస్తోంది. లేకపోతే వీడుత్త ఫూల్, స్టుపిడు, నిన్కంపూప్— అనేస్తారు కొలీగ్స్!"

నాకు భాస్కరం ఆర్గుమెంటు నచ్చలేదు. అతను తల్చుకుంటే వాళ్ళన్నయ్యకూడా యిలాగే చెప్పేస్తాడు. వాళ్ళన్నయ్య నీ చదువుకీ నాకూ సంబంధంలేదు పో అంటే మరుచటి రోజు యితను దశరథరామయ్యలాంటి వాడెవరి దగ్గిరో సాష్టాంగపడి యల్.డీ.సీ. జాబ్‌కి కూడా తన్ను తాను హీన పర్చుకొని ఆశ్రయించవలసిందే. అప్పుడు అతను కూడా "వెనకాల ఏమీలేని వాడు" అని యితన్ని ఆదరించకపోవచ్చునేమో.

అందుచేత నే నతన్ని చెక్ చెయ్యదల్చుకోలేదు.

o o o

నిజంగా భాస్కరానికి ఇది దురదృష్ట దశ. ఏలినాటి శని ఏడేళ్ళన్నట్టు అతనికి ఈ శని కొన్ని నెలలుంటుందేమో అతనికి కావలసిందేమిటి?- మినిమమ్ ఒక్కర్తయినా గర్ల్‌ఫ్రెండు. అతని కబుర్లు వినాలి. అతన్తో గంటల తరబడి మాట్లాడుతూ యెదురుగుండా కూచోవాలి. మధ్య మధ్య భోజనాలూ, కాఫీలూ ఏవి అవసరం అయితే అవీ - వాటంతట అవి వొచ్చి వాలాలి. చదువెలా సాగుతోందని గాని, డబ్బు ఎక్కణ్నుంచి వస్తోందని గాని ఎవరూ అడగరాదు. ఇదంతా ఈ ప్రకారం జరగాలంటే చాలా అదృష్టమే కాక; మిగతా ప్రపంచానికి చాలా వోర్పు వుండాలి. జరగడం లేదు! అందుకే ఇది దురదృష్ట దశ అన్నాను.

మొన్నటిదాకా నిర్మలవుండేది. వాళ్ళమ్మ రిటైర్డుడి.యీ.వో. బంగళాఅంత కొంపలో వాళ్ళద్దరే ఉండేవాళ్లు. నిర్మలకి యితనంటేనూ వాళ్ళమ్మకి నిర్మలంటేనూ భూతద్దంలోంచి చూసినా తప్పుకనిపించనంతఆరాధనాభిమానాల చత్వారం. చివరికి ఇరవై నాలుగ్గంటలూ చదువూ సంధ్యా మానుకుని నిర్మల భాస్కరాని కెదురుగా కూచుంటే కూడా, ఆవిడ భాస్కరాన్నే కోప్పడ్డది కూతుర్నికాక. యెక్కణ్నుం చొచ్చాయో, భాస్కరానికి కష్టాలు. నలభై ఏళ్ళనించీ బెంగాల్‌లోనే ఉండి పోయిన రంగమ్మగారి అన్నగారి రూపంలో కొన్ని; ఫారిన్ వెళ్ళొచ్చిన ఆయన కొడుకు రూపంలో మరికొన్ని వచ్చేయి. సరీగా సమయానికి నిర్మల యం. ఏ. అనిపించుకుంది, దాంతో రంగమ్మగారు మకాం కలకత్తాకు మార్చేసింది.

అంతకుముందు; ఇంకా అంతకుముందు; మరికొంతముందు; అసలు మొట్టమొదట కూడా భాస్కరానికి అతన్ని మెచ్చేవాళ్ళు, వాళ్ళకి వాళ్ళని మెచ్చే వాళ్ళవాళ్ళు - ఉంటూనే వొచ్చారు. అతని ఎడ్యుకేషనంతా కో ఎడ్యుకేషనే. చదువెలాగయినా వస్తుందోయ్ సౌందర్యాస్వాదన ఎలాగబ్బుతుంది -

అన్న పిల్లాడిలో పడి; కో ఎడ్యుకేషన్ కాంది అసలు ఎడ్యుకేషన్ కాదన్న లెక్కకి వచ్చేవాడు.

ఇప్పుడు- ఒంటరి అయిపోయాడు. భయపడిపోయాడు. ఒంటరితనం లోంచి న్యూనత, దుర్మార్గం; పాపం యివన్నీ పుట్టుకువస్తాయని వులిక్కిపడుతున్నాడు. ఎక్కడ కాలు జారుతుందోనని బెదరిపోతున్నాడు, యిదివరకు జారలేదని కాదు. అప్పుడంతా జారిన కాళ్ళు యితనివి కావు.

సరే.... .... దొండపర్తి తీసుకువెళ్ళాను. ఆవేళ డాక్టర్ కృష్ణమూర్తి గారి భార్య ఊరెడుతూ పొద్దుట కనిపించింది. కృష్ణమూర్తిగారు మూడు గంటలకి బయల్దేరి రౌండ్స్‌కి వెళతారుగా. అందుకని మూడుంపావుకి మేం అక్కడే ఉండేటట్టూ ఏర్పాటు చేశాను. దూరంనించే మూసున్నతలుపు చూపించి "అదుగో అదే వాళ్ళిల్లు. వాళ్ళెవరూ లేనట్టున్నారు" అన్నాను డిజప్పాయింట్ మెంట్ నటిస్తూ. "కల్యాణి ఈ పూర్తి అయిపోతే ఇక్కడే వుంటుందిగా. మీరు విరివిగా కలుసుకోవచ్చు." అన్నాను మళ్ళీ అందులోనే ధైర్యం పొలకబోస్తూ.

చాలా నిరుత్సాహపడ్డాడు. "మీరు లేనప్పుడుకూడా నేను రాగలననుకోండి. అయినా మీరు ఇంట్రడ్యూస్ చేసిందానికీ దానికీ తేడావుంది కదా" అన్నాడు భాస్కరం.

ఆ పాయింట్ నేననుకున్నదే. నాకు నచ్చింది. ఎటువంటి వాళ్ళనైనా తానుగా వెళ్ళి పలకరించి పరిచయం చేసుకొని పది నిముషాల్లో తనవార్ని చేసుకోగల కుర్రాడు ఇలా అనడం నాకెంతో గర్వకారణమైంది.

ఆ పైవారం అతని రూమ్‌లో వుండగా నిద్రొచ్చింది. లేచి మొహం కడుక్కోడానికి వెళ్ళి వచ్చాను. జేబులోంచి పడ్డ కాగితాల్లోనించి ఫోటో తీసి చూస్తున్నాడు భాస్కరం. ఆ ఫోటోలో అమ్మాయికి మొహంలేదు.అంటే, ఫోటో పేపరు పైపొర చిరిగిపోయింది; మొహం దగ్గర.

"ఎవరిదండీ యీ ఫొటో!"

"అదే; అయామ్ సారీ- దానికో చిన్న యాక్సిడెంట్ అయింది. ఈమాటు మంచిది తెస్తాను"

"పూర్ణి కల్యాణిగారిదేనా?"

గారు అనడం; అందులో నాదగ్గర - యిదే మొదలు ఈ మార్పుకూడా

నాకు నచ్చింది, నేను ఇంట్రడ్యూస్ చేస్తున్న కేండిడేట్ అనే కారణం వల్ల కాక పోయి కూడా వుండవచ్చును.

అవునయ్యా ఈ ఉదయం పాత కాగితాలు తీస్తూ వుంటే ఈ ఫొటో కన బడ్డాది. ఇది ఆ అమ్మాయి ఇంటర్ కాలేజియేట్ మ్యూజిక్ కాంపటీషన్లో గెల్చి నప్పుడు వాళ్ళ మేగజైనులో వెయ్యడానికి తీసింది. అప్పుడు ఆయన ఈఊళ్లోనే ట్రెజరీ అఫీసర్‌గా ఉండేవాడు. కుటుంబంతో అనకాపిల్లి క్యాంపు వస్తేను. అక్కడ తీయించారు. వెధవది - ఇందాక జేబులో స్టాంపులు పెట్టుకున్నాను; అందులో ఒకటి సరిగ్గా ఆ ఫొటోమీద అతుక్కుపోయింది. గట్టిగా ఊడదీసే సరికి పొర లేచొచ్చేసింది.—" అని కథంతా చెప్పేను.

"ఇంటి దగ్గిర జేబులో వేసుకురాడం నా కిద్దామనేనా?"

"అవును."

".... ఏం చేస్తాం, నాకా అదృష్టం లేదు."

అయిదేళ్ళగా అతనామాట అనడం నేను విన్లేదు. అతని స్వాతిశయం తగ్గించ గలుగుతున్నానని" ఆనందంతోబాటు అతని పట్టువదలని ఆత్మ విశ్వా సాన్ని పోగొడ్తున్నానేమో అని భయంకూడా వేసింది..... .... ఏ మాత్రం దిగినా దిగాడే - అని మింగేసి ఊరుకున్నాను.

ఆ మరుసటి వారం వైజాగ్ వెళ్ళినప్పుడు "ఈ ఉత్తరం చదువు. దీంట్లో నీకు కొంత ఇంటరెస్ట్ కలిగించే మేటర్ వుంది" అన్నాను.

ఆడపిల్ల దస్తూరీ: మధ్యలో ఎక్కడో తన పేరు; ఆ కాగితం చూసీ చూడగానే భాస్కరానికి కనబడిపోయాయి. వెంటనే - తన్నాన నన్ననన్నాం అంటూ దేవగాంధారి రాగంతో ఆ వచనం చదవడ ప్రారంభించేడు.— "మొన్న - మా కాలేజీ మెన్స్ హాస్టలు వాళ్ళు వైజాగ్‌నించి ఎవరో లిట్రేచర్ ఎమ్మే అబ్బాయి భాస్కరంగారుట—అతన్ని మిమిక్రీ కోసం పాటలు పాడ్డం కోసం పిలిపించేరు. అతని పెర్ఫార్మెన్స్ ఎంతో బాగుంది. నిజానికి అది మెన్స్ హాస్టల్ వాళ్ళ ఫంక్షనే అయినా మాలో చాలామందికిఇన్విటేషన్లొచ్చాయి. నాకు రాకపోయినా ఎలాగో వెళ్ళేను. ప్రోగ్రాం చాలా థ్రిల్లింగ్‌గా వుంది. నాన్నతో చెప్తే ఆ భాస్కరంగారు నీకు బాగా తెలుసునని చెప్పేరు. నేను వైజాగు వచ్చేవరకు ఆయన అక్కడే వుంటారా? ఉంటే నాకు తప్పకుండా యింట్రడ్యూస్ చెయ్యి."

అంతవరకు చదవగానే ఆ ఉత్తరం లాగేశాను "మిగిలింది ఏదో ఫామిలీ వ్యవహారం" అన్నాను.

"ఐసీ-ఎవరు రాశారో చెప్పండి మరీ-" అన్నాడు చిరునవ్వు దాచుకో సంతా భాస్కరం.

"ఇంకెవరయ్యా మహానుభావా! పూర్వీ కల్యాణి" అని ఇన్లాండు కవరు మడతపెట్టి ఫ్రమ్ ఎడ్రస్ చూపించేను. "టి. పి. కల్యాణి థర్డ్ ఎం. బి. బి. ఎస్.-"

సంతోషంగా నిట్టూర్చాడు భాస్కరం. "గుంటూరు వెళ్ళినపుడు పూర్వీ కల్యాణిగార్ని మీటవుదామని చాలా ట్రై చేసేనండీ. కాని వుమెన్స్ హాస్టల నించి వచ్చిన ఇన్వైటీస్ లిస్ట్లో ఆవిడ పేరు లేదు. ఒకబ్బాయి నడిగితే ఆవిడ హాస్టల్లో లేరు-అన్నాడు. మరి కొంతమందిని అడిగాను: పూర్వీ కల్యాణి గార్ని తెలుసా; అని. సరైన రెస్పాన్స్ రాలేదు........ అక్కడి వాళ్ళకి అంత చైతన్యం లేదు లెండి. అమ్మాయిల నామినల్ రోల్ కంఠస్థం రాకపోతే మరెందుకండి!....అయినా మనం ఆ ఊరెళ్ళి అక్కడి వాళ్ళని ఏమిఅంటాం! ఏదో వచ్చేశాను- ఎనీవే ఆవిడ లక్కీ గానా ప్రోగ్రాంకి వచ్చేరు. దట్స్ వెరీ గుడ్."

"లక్కీగా - అంటే - ఎవరిది లక్కంటావు?" అన్నాను పెంకెతనంగా!

"ఇద్దరిదీ ననుకోండి -" అని కాంప్రమైజ్ అయ్యాడు భాస్కర్. అది కూడా గమనించేను,

ఇంక చాలు - అనుకున్నాను; నాలో నేనే నవ్వుకొని.

* * *

తరువాత రెండు నెలలు భాస్కరం దగ్గిరికి వెళ్ళడం పళ్ళేదు. ఆర్.డి వో. గారు మా ఆఫీసు ఇనస్పెక్షన్ చేయడం; మినిస్టర్స్ టూర్స్ కోసం ఏవేవో వివరాలు సేకరించి ఏర్పాట్లు చేయించడం - ఇలా ఏటో రొటీన్లో ముఖ్యమైన పన్లు పడ్డాయి. ఓ సారి జీపులో విశాఖపట్నం వెళ్ళినా- భాస్కరం రూమ్కి వెళ్ళడానికి కుదర్లేదు. కలెక్టర్ ఆఫీసులో పని ముగించుకొని వెంటనే అనకాపల్లి వెళ్ళిపోయాం.

అవకాశం వున్నా వెళ్ళాలని లేక వో పదిహేను రోజులు ఊరుకున్నాను. కాని [illegible] [illegible] చేసేను కదా. అవి భాస్కరంచెప్పిన పనిచెయ్యాలి.

కొన్నాళ్ళు విరహంగా; కొన్నాళ్లు పూర్వీ కల్యాణి ఆరాధనగా చివరికి అన్వేషణగా పని చేసి పరిణామం చెందాలని; చివరికి ఆటంబాంబు నొక్కసారిగా వేసి డిజిల్యూషన్మెంట్ కల్పింతామని నా స్కీము.

"పూర్వీ కల్యాణి మంచి ఇంపైన రాగము. ఎవరినైనా అడిగి బాణీ ప్రాక్టీస్ చెయ్యి. ముందు ముందు పనికొస్తుంది" అన్నాను వొకసారి అతనితో.

"శాస్త్రీయ సంగీతమే - అమ్మ బాబోయ్!" అన్నాడు.

నేను మాయాబజార్లో శ్రీకృష్ణుడి లాగ నవ్వుతూ "అది నీకు శాస్త్రీయ సంగీతం ఎలా అవుతుంది? స్త్రీయ సంగీతం కదా!" అన్నాను.

"ఎగ్రీడ్!" అన్నాడు.

ఆ దర్పం విరగ్గొట్టాలంటే; ముందు దాన్ని పెరగనివ్వాలి. (పెరుగుట విరుగుట కొరకు కదా. మరి!) పెరగాలంటే అతనికి; దాన్ని పెంచుకోడానికి టైమ్ యివ్వాలి.

టైమ్ నేను వేరే యివ్వక్కర్లేకుండా, దానంతటదే ఏర్పాటైంది.

*   *   *

డిపార్టుమెంటల్ గండాలన్నీ గడిచి, మెంటల్ గండాల్లో, సమస్యల్లో భాస్కరం వొకడు. అతన్ని భారతదేశానికి పాలనా రంగంలో పనికి వచ్చే ఉత్కృష్ట పౌరుడిగా కాకపోయినా సామాన్యమైన బాధ్యతగల పౌరుడిగా చేయగలిగితే చాలు. సెన్సువల్ నాన్సెన్సులోంచి సెన్సులోకి లాగగలిగితే అదే పదివేలు.

వైజాగ్ వెళ్ళేను రూమ్‌లో భాస్కరం లేడు. "ఇప్పుడే వెళ్ళేడు బాబూ" అన్నది కిందని కాపలా వుండే ముసలమ్మ. ఎవరెవరు వెళ్ళేరని అడిగాను. "ఎవరో అడకూతురుతో సేతులు గలుపుకొని యెల్లా"డండి. నా గుండెల్లో రాయిపడ్డాది.

రెండు నెలలు నేను రాకపోవడం వల్ల పూర్వీ కల్యాణిని మర్చిపోయి ఎవరో కొత్తహీరోయిన్ని సంపాదించేసేడు. నా ఊహా నిర్మితరాగ ప్రసారం అంతా కీచురాయి పాటగా మిగిలిపోయింది.

అతన్ని చూడాలి.

సినిమాల సైన్ బోర్డులు చూసేను. లీలామహల్లో ఏదో డోరిస్ డే-టోనీ కర్టిస్ కాంబినేషన్ ఉంది. అక్కడ తప్పకుండా ఉంటాడు, ఇంకా టైముంది.

*   *   *

బాల్కనీలో వున్నాడు భాస్కరం. ఆ అమ్మాయితో సరదాగా కబుర్లు చెబుతూ; షోగ్గా పాపకార్న్ కొరుకుతూ; సిగరెట్ కాల్చలేక పోతున్నాననే అన్న దిగులు పొడలని చిరునవ్వు మొహంతో ముందుకి వొంగి కూర్చున్నాడు. చరచర అతని పక్కకి వెళ్ళాను.

నన్ను చూడగానే భాస్కరం మొహం విప్పారింది. "మామూలు ప్రిగల్భమే" అనుకున్నాను. "చూసేవా; కొత్త పిట్టని పట్టేను - అన్న దర్పం అని లోపల పీదరించుకున్నాను....పైకి ఆ అమ్మాయి దగ్గర ఎట్లా? నేనేమన్నా భాస్కరం పెద్దన్నయ్యనా?

"మీట్ మిస్ పంచకల్యాణి" అన్నాడు; నాతో అరక్షణంసేపు ఆమె వేపు తిరిగి చిరునవ్వుతో "అదే, మిస్ పూర్వి కల్యాణీ" అన్నాడు. ఆమె అందంగా నవ్వింది.

"అయామ్ సూరిబాబు" అన్నాను నవ్వుతో నమస్కారం చేస్తూ.

"అనకాపిల్లి తాలూకాఫీసులో డిప్యూటీ తాసిల్దార్" అని భాస్కరం నన్ను పరిచయం చేసేరు. "మా ఫేమిలీ ఫ్రెండు. వెల్ విషర్....నాకు మిమిక్రీకి అప్పుడప్పుడు మెటీరియల్ సప్లయి చేస్తూవుంటారు...."

"అయామ్ గ్లాట్టు సీ యు" అన్నదామె;

"ఐ టూ" అన్నాను.

మరునిమిషం ఎవరం మాట్లాలేదు.

"అయిందా? ఇప్పుడు చెప్పండి. మీ యిద్దర్లో ఎవరో అబద్ధాలాడేరు. నాతోటి" అని భాస్కరం కుర్చీలో వెనక్కి చారబడ్డాడు.

నేనూ, నేను సృష్టించని పూర్వి కల్యాణీ ఎదురుగా, దగ్గిరగా అయిపోయాం.

"ఆవిడ మిమ్మల్నెపుడూ యరగనంటోంది. మీరేమో ఆవిడ మీకు రాసిన ఉత్తరాలు చూపిస్తున్నారు, ఇందులో ఏదో మాయ వుంది" అన్నాడు భాస్కరం.

నేనబద్ధాలాడేనని, అతని సౌందర్య పిపాసమీద డర్టీ ట్రిక్ప్లే చేసేనని, ఖచ్చితంగా అనడంలేదు భాస్కరం. నా కదే సంతోషంగా వుంది. నా ఎమ్యూజ్మెంటుని అతను డిస్టర్బ్ చెయ్యలేదు అతని "వేట" ఆగకపోయినా నాకేం పెద్ద యిబ్బందిలేదు——

* * *

మీ రబద్ధాలాడేరని నే నెప్పుడో కనిపెట్టేను గురూ గారూ! ఫొటో పోటకి స్టాంపు అతుక్కొని ఊడిపోడం: డాక్టరుగారింటికి నన్ను సరిగ్గా వాళ్ళు

లేనప్పుడే తీసుకువెళ్ళడం- ఇలాంటివి మొదట సరిగా తెలియలేదనుకోండి; క్రమంగా ఆలోచిస్తే బోధపడిపోయాయి.

"అయితే ఇందులో యెక్కడో ఏదో కొంత నిజం వుందని నాకు ఇన్ట్యూషన్ చెప్పింది........ అంతా కల్పించి చెప్పడానికి వీలుగాలేదని తట్టింది పనీపాటలూలేక తిరిగేబదులు ఇన్వెస్టిగేట్ చేదామని బయల్దేరాను- ట్రెజరీ ఆఫీసుకి వెళ్ళి రిటైరై పోయిన దశరథరామయ్యగారు ఎక్కడుంటారని అడిగీ అడగ్గానే; అతివినయంగా వొక గుమస్తాగారు; చేస్తూ చేస్తూవున్న పని ఎవరికో వొప్పగించి నా వెంట వీళ్ళింటి కొచ్చేడు. ఆయన రిటైరవలేదని ఆఫీసు మెట్లు దిగుతూ వుండగానే తెలిసింది.

"దశరథరామయ్యగారికి ఒక కూతురూ ఒక కొడుకూ, కరక్టు. కూతురు పంచకల్యాణి- మీకే డిటేల్సు ఎలా తెలుసును? ఆయన్ని అడిగాను; "డిప్యూటీ తాసిల్దార్ సూరిబాబు తెలుసా" అని. ఉహూ.... అప్పుడు గెస్ చేసేను. పూర్వం ఆయనెక్కడో. మీకు తాసిల్దార్‌గా తటస్థపడివుంటారు. ఉరమరికగా పిల్లల గురించి తెలుసు-

"ఆయనకిగాని ఈ అమ్మాయికి గాని మీ రెవరో తెలీకుండా నీళ్ళ పేస్టు తెలుసుకోవడం కష్టం. ఐ కం గ్రాచులేట్ యు కాని ఎలా గెస్ చేసేరు?" అన్నాడు భాస్కరం,

"మీ ప్రశ్నకు సమాధానం చెప్పేను; మీ పరిచయానికి వున్న బేక్ గ్రౌండూ ఫ్యూచరూ తెలిస్తేతప్ప!" అన్నారు, నేను ఉడుక్కొని వుండాలి.

"బలేవారే- మా అమ్మను రాజమండ్రి నుంచి రప్పించి పునాది డైలాగ్స్ పడేవరకు ఈ అమ్మాయిని నాకు పరిచయమే చెయ్యలేదు; దశరథరాములవారు- ఏకపత్నీవ్రతుడే కాక- ఏక జామాతావ్రతులు; అన్నాడు భాస్కరం ఆమెవేపు కొంటెగా నవ్వుతూ.

"పోనిద్దురూ; మీకు మరీనూ!" అన్నట్టు మొహం పెట్టిందా అమ్మాయి.

"అలా అయితే నా గమన శ్రమ ఫలించినట్లే" అన్నాను,

"ఏమిటేమిటీ -గమన-శ్రమా? అదేమిటది?" అన్నాడు భాస్కరం కంగారు పడుతూ.

"అదేలే—పూర్వీ కల్యాణి మరో పేరు." అన్నాను.

సినిమా మొదలయింది.

—o—